


నేడు వైసిపి పాలకొల్లు నియోజకవర్గస్థాయి సమావేశం

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి పాలకొల్లు నియోజకవర్గస్థాయి సమావేశం ఈ నెల 31న గురువారం పాలకొల్లులో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపీ) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వైసిపి గోదావరి జిల్లాల ఇన్‌ఛార్జి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి రానున్నారని పేర్కొన్నారు. పెద్ద సాయిబాబా గుడి రోడ్డులోని అడబాల గార్డెన్స్‌లో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, నియోజకవర్గంలోని జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, వార్డు ఇన్‌ఛార్జిలు, గ్రామ కమిటీల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, అనుబంధ కమిటీలు, మహిళా నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

కార్పొరేషన్లు నిర్వీర్యం..!



బిసి, ఎస్‌సి, కాపు, మైనార్టీ తరగతులకు పెనుదెబ్బ

బ్యాంకు రుణాలతో పొందే ఉపాధికి గండి

గత ప్రభుత్వాల హయాంలో లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు

నేడు ఏఒక్క పథకమూ అమలు కాని దుస్థితి

పథకాల సొమ్ము కార్పొరేషన్ జాబితాలో నమోదు

వెనుకబడిన తరగతులకు కొరవడిన ఉపాధి భద్రత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఉపాధి భద్రత కల్పించి వెన్నుదన్నుగా నిలిచిన బిసి, ఎస్‌సి, కాపు, మైనార్టీ కార్పొరేషన్లు నిర్వీర్యమయ్యాయి. దీంతో వివిధ తరగతుల ప్రజలకు బ్యాంకు రుణాలతో ఉపాధి మార్గం ఎంచుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆయా తరగతుల ప్రజల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వాల హయాంలో బిసి, ఎస్‌సి, మైనార్టీ కార్పొరేషన్లకు ప్రత్యేక స్థానం ఉండేది. 2014లో టిడిపి ప్రభుత్వం వచ్చాక కాపు కార్పొరేషన్‌ను సైతం ఏర్పాటు చేసింది. చదువుకుని ఉపాధి లేని నిరుద్యోగులకు కార్పొరేషన్లు అండగా నిలిచేవి. ప్రతియేటా లక్ష్యాలు నిర్ధేశించుకుని బిసి, ఎస్‌సి, మైనార్టీలకు బ్యాంకు రుణాలు ఇప్పించి ఉపాధి మార్గం చూపేవి. కిరాణా కొట్లు, ఫొటో స్టూడియోలు వంటి ఎన్నో వ్యాపారాలు పెట్టుకోవడంతోపాటు, కార్లు వంటివాటితో ఉపాధి పొందేందుకు కార్పొరేషన్లు సహాయ పడేవి. ప్రతి యూనిట్‌కూ రూ.లక్ష నుంచి రూ.పది లక్షలు వరకూ ఇచ్చిన పరిస్థితి కొనసాగేది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ రుణాలు పెద్దఎత్తున ఇచ్చిన పరిస్థితి ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన బిసి తరగతికి చెందిన కుటుంబాలకు బిసి కార్పొరేషన్ ద్వారా దాదాపు పది వేలకుపైగా యూనిట్లు మంజూరయ్యాయి. కాపు కార్పొరేషన్ ద్వారా 15 వేల యూనిట్లు వరకూ ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా తొమ్మిది వేలకుపైగా యూనిట్లు ఇచ్చారు. నిరుద్యోగులు, చదువుకోనివారు సైతం కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు పొంది లబ్ధి పొందారు. తీసుకున్న రుణంలో సగం సబ్సిడీ కింద ప్రభుత్వం భరించేది. రూ.లక్ష రుణం ఇస్తే రూ.50 వేలు సబ్సిడీ వర్తించేది. తీసుకున్న రుణంలో సగం సొమ్ము సబ్సిడీ కింద పోవడంతో లబ్ధిదారులకు ఎంతగానో మేలు జరిగేది. బ్యాంకు రుణాలు పొందిన కుటుంబాలకు ఏదోక ఉపాధి మార్గం దొరికేది. ఉపాధికి సంబంధించిన యూనిట్ ఏర్పాటు చేస్తేనే కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు మంజూరయ్యేవి. దీంతో లబ్ధి పొందిన ప్రతి కుటుంబమూ ఏదోక యూనిట్‌ను తప్పకుండా ఏర్పాటు చేసేవి. యూనిట్ ఏర్పాటుతో వచ్చే ఆదాయంతో ప్రతినెలా బ్యాంకు వాయిదాలు చెల్లించుకునేవారు. ఎంతోమంది కార్లు పొంది వాటిద్వారా ఉపాధి పొందారు. కార్పొరేషన్ రుణాల కింద కార్లు పొంది ఇప్పటికీ ఉపాధి పొందుతున్న కుటుంబాలు చాలా ఉన్నాయి.

ఉత్సవ విగ్రహాలుగా కార్పొరేషన్లు

వైసిపి ప్రభుత్వం వచ్చాక బిసి, ఎస్‌సి, మైనార్టీ, కాపు కార్పొరేషన్లే కాకుండా, బిసి సామాజిక తరతగతుల్లో అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఛైర్మన్లను, డైరెక్టర్లను నియమించింది. అయితే నిధులు మాత్రం ఇవ్వలేదు. దీంతో ఛైర్మన్లుగా నియమితులైన వారు ఏం చేస్తున్నారో కూడా ఏఒక్కరికీ తెలియని పరిస్థితి ఉంది. కార్పొరేషన్ల పరిధిలో ఎటువంటి కార్యక్రమాలూ జరగడం లేదు. గతంలో రుణాల కోసం వచ్చే జనంతో కళకళలాడే కార్పొరేషన్లు నేడు వెలవెలబోతున్నాయి. పాత రుణాలకు సంబంధించిన వసూళ్లకు ఉద్యోగులు పరిమితమైన పరిస్థితి ఉంది. రాష్ట్రంలో అన్ని తరగతులకు ఇచ్చే సంక్షేమ పథకాల సొమ్మును బిసి, ఎస్‌సి, కాపు, మైనార్టీలకు ఇచ్చిన సొమ్ముగా చూపిస్తున్నారే తప్ప, ఉపాధి కల్పించే బ్యాంకు రుణాల గురించి మాత్రం ప్రభుత్వం మాట్లాడటం లేదు. కార్పొరేషన్ రుణాలు మంజూరు లేకపోవడంతో ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి. కార్పొరేషన్ రుణాలను పునరుద్ధరించాలని ఆయా తరగతుల ప్రజలంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.



తణుకులో..



పెనుమంట్రలో..

భారాలకు చిరునామా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

సిపిఎం సమరభేరి నిరసనల్లో నేతలు



భీమవరంలో..

ప్రజాశక్తి - భీమవరం

ప్రజల నెత్తిన భారాలు మోపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుంటున్నాయని, పేదల సమస్యలు పరిష్కారంలో ఆమడ దూరంలో ఉంటాయని, అందుకే భారాలకు చిరునామాగా ఈ రెండు ప్రభుత్వాలు ఉన్నాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.రాజారామ్మోహన్‌రాయ్ విమర్శించారు. సిపిఎం చేపట్టిన సమరభేరీలో భాగంగా స్థానిక 38వ వార్డు లంకపేటలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని రాజారామ్మోహన్‌రాయ్ బుధవారం ప్రారంభించారు. మోడీ తొమ్మిదేళ్ల పాలనలో వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచారని, నిరుద్యోగ యువతకు ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదని విమర్శించారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మోడీ ప్రభుత్వ సూచనతో విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై విపరీతమైన విద్యుత్ ఛార్జీల భారం మోపుతున్నారని విమర్శించారు. పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మరోపక్క ఉపాధి లేక అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ధరలు అరికట్టి ప్రజలను ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడారు. నాయకులు బి.చైతన్యప్రసాద్, బి.త్రిమూర్తులు, డి.నాగేశ్వరరావు, కె.కృష్ణ, ఎం.ఆంజనేయులు, సాయమ్మ కుమారి, సాంబ పాల్గొన్నారు.

పెనుమంట్ర: సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన ప్రచార యాత్రలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, నేతలు కోడి శ్రీనివాస్ ప్రసాద్, బత్తుల విజయకుమార్, తానేటి ఆంజనేయులు, మాదాసు లక్ష్మణరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: సిపిఎం సమరభేరీ నిరసనల్లో పాల్గొనాలని ఆ పార్టీ పట్టణ కమిటీ సభ్యులు జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. తక్షణం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పట్టణాల్లో కూడా ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం భాగ్యలక్ష్మీపేట, సీతారాంపేటల్లో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులు వివరిస్తూ సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో మడక రాజు, నరమాల కృష్ణ, చిటికిన రాము, పోతు శ్రీనివాస్, శిద్దిరెడ్డి శేషుబాబు, పతివాడ నాగేంద్రబాబు, యడవల్లి వెంకన్న పాల్గొన్నారు.

తణుకు రూరల్: ప్రజలపై భారాలు వేసే ప్రభుత్వాలకు పాలించే అర్హత లేదని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. బుధవారం స్థానిక అమర వీరుల భవనం వద్ద నుండి అధిక ధరలు, నిరుద్యోగం వంటి సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నిరసిస్తూ సమర భేరీ నిర్వహించారు. శ్రీనువారి వీధి, బ్యాంక్ కాలనీ, రైల్వే స్టేషన్, ఫ్లయ్‌ఓవర్, రైల్వేగేట్, కోయాక్స్‌యల్ రోడ్డుల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు గార రంగారావు, ఎ.అజయకుమారి, కామన మునిస్వామి, గుబ్బల గోపి, ఎం.గోవిందరాజు, త్రిమూర్తులు, టి.వెంకటేశ్వరరావు, ఎన్.చిన్నారావు, రమేష్ పాల్గొన్నారు.

ఆకివీడు: జగన్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ అడుగుజాడల్లో నడుస్తూ భారాలు మోపుతోందని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు విమర్శించారు. ఆ పార్టీ కార్యకర్తలు బుధవారం పట్టణంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బి.మాణిక్యం, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.




భీమవరంలో..



ఉండిలో..

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్ ప్రారంభం



మొగల్తూరులో

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన ప్రైమ్ 2.0 కార్డ్ విధానాన్ని నిరసిస్తూ స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు, స్టాంప్‌వెండర్లు నిరసన చేపట్టారు. ఈ నెల 30, 31వ తేదీల్లో చేపట్టిన పెన్‌డౌన్‌లో భాగంగా బుధవారం లేఖర్లు దస్తావేజులు రాయలేదు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనులు పూర్తిగా స్తంభించాయి. లేఖరుల పెన్‌డౌన్ గురించి ముందుగానే తెలియడంతో కక్షిదారులు సైతం ఎవరూ కార్యాలయానికి రాకపోవడం విశేషం. నిరసనలో లేఖరుల సంఘ సభ్యులు టి.జితేంద్రనాథ్, టి.అనిల్, వై.సుబ్బారావు, గుడిపాటి వెంకటేశ్వరరావు, వేము రంగారావు, మోర వీరారెడ్డి, సతీష్, షాకీర్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఉండి: ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ నిర్వహించారు. ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ పి.రుక్మిణికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైమ్ 2.0 విధానంపై పునరాలోచించి వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొమ్మన రాఘవ, బురిడి రవిబాబు, నందుల నారాయణమూర్తి, సహాయకులు, డిటిపి ఆపరేటర్లు, స్టాంపు వెండర్లు పాల్గొన్నారు.

మొగల్తూరు: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు బుధవారం పెన్‌డౌన్ చేపట్టారు. కార్యక్రమంలో మొగల్తూరు సంఘ అధ్యక్షుడు కొల్లాటి వెంకటేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, పట్టపు రాము, రాజేష్, కడలి శేఖర్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా ప్రైమ్ 2.0 పేరిట తీసుకొస్తున్న కొత్త సాఫ్ట్‌వేర్‌ను వెంటనే ఆపాలని కోరుతూ దస్తావేజు లేఖర్లు బుధవారం పెన్‌డౌన్ చేపట్టారు. స్థానిక భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద, గునుపూడి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక తహశీల్దార్ రవికుమార్‌కు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టి.మధు, నాగిడి సారథి, జి.మధు, కె.విజయకుమార్, వై.శ్రీనివాస్, లేఖర్లు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం సభలో మాట్లాడుతున్న లోకేష్

చింతలపూడి నియోజకవర్గంలో కొనసాగిన లోకేష్ యువగళం

199వ రోజు బొర్రంపాలెం నుంచి జంగారెడ్డిగూడెం వరకూ యాత్ర

బహిరంగ సభలో చింతలపూడి, పోలవరం ఎంఎల్‌ఎలపై అవినీతి ఆరోపణలు

టిడిపిలో చేరిన పలువురు నేతలు

గ్రీన్‌ఫీల్డ్ రైతులకు చట్టప్రకారం న్యాయం



లోకేష్‌కు రాఖీ కడుతున్న మహిళలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జంగారెడ్డిగూడెం

టిడిపి అధికారంలోకొచ్చాక గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులకు 2013 భూసేకరణ చట్టప్రకారం న్యాయం చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర 199వ రోజు బుధవారం పోలవరం నియోజకవర్గం టి.నర్సాపురం మండలం బొర్రంపాలెంలో ప్రారంభమై వల్లంపట్ల, మల్లుకుంట, రావికంపాడు మీదుగా చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డిగూడెం మండలంలోని దేవులపల్లి, పుట్లగట్లగూడెం, గురవాయిగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం వరకూ సాగింది. జంగారెడ్డిగూడెం సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడారు.

యాత్రలో లోకేష్‌కు గజమాలలతో టిడిపి నాయకులు స్వాగతం పలికారు. జనంతో కరచాలనం చేస్తూ, పలకరిస్తూ లోకేష్ ముందుకు సాగారు. పుట్లగట్లగూడెం వద్ద జంగారెడ్డిగూడెం మండలం గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ప్రజోపయోగార్థం భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. జాతీయ రహదారి విస్తరణకు 2013 భూసేకరణ చట్టాన్ని అనుసరించకపోవడం దురదృష్టకరమన్నారు. టిడిపి అధికారంలోకొచ్చాక గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులకు చట్టప్రకారం న్యాయం చేస్తామన్నారు. రైతుల పొలాలకు నీరందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. లక్కవరం గ్రామానికి చెందిన మత్స్యకారులు లోకేష్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ఉపయోగపడే చెరువులను సైతం జగన్ వైసిపి దొంగలకు కట్టబెడుతున్నాడన్నారు. చంద్రబాబు పాలనలో మత్స్య కారులకు చెరువులు ఇవ్వాలని జిఒ ఇస్తే జగన్ తమ పార్టీ నాయకులకు చెరువులు ఇవ్వాలని చూడటం దుర్మార్గమన్నారు. తాము జిఒ 217ను రద్దు చేస్తామన్నారు. న్యాయవాదులు తమ సమస్యలపై లోకేష్‌కు వినతిపత్రం ఇచ్చారు.

టిడిపిలో చేరిన పలువురు నేతలు

పలువురు నేతలు లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్‌యాదవ్, ఆయన సోదరుడు మంగపతి యాదవ్ టిడిపిలో చేరారు. లోకేష్ వారికి పసుపు కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. వైసిపి నేతలు పాకనాటి శ్రీనివాస్‌యాదవ్, పొన్నబోయిన సురేష్‌యాదవ్, చేకూర్తి మల్లాచారి, నీలపాల సూర్యచంద్ర, రాసూరి నాగరాజు, గోరుమచ్చు రవితేజ, శ్రీనివాస్ టిడిపిలో చేరారు.

తారాస్థాయికి చింతపూడి, పోలవరం ఎంఎల్‌ఎల అవినీతి

జంగారెడ్డిగూడెంలో జరిగిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజాపైనా, పోలవరం ఎంఎల్‌ఎ బాలరాజుపైనా తీవ్ర అవినీతి ఆరోపణలు గుప్పించారు. చింతలపూడి ఎంఎల్‌ఎ పేరు ఎలిజా కాదని, అవినీతి రాజా అన్నారు. పాస్ పుస్తకాల్లో లంచం, ఎర్రకాలువ రిజర్వాయర్‌లో మట్టి కొట్టేసి కోట్లు సంపాదన, షిఫ్ట్ ఆపరేటర్లు, అంగన్‌వాడీ, ఆయాల నియామకాల్లో లంచాలు, ఇసుక దోపిడీ, భూముల్లో దోపిడీ, కొత్త అధికారి వస్తే మూడు నెలల జీతం కప్పం, ఇలా అనేక విధాలుగా దోచుకుంటున్నారన్నారు. పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు కాదని, బాలనాగు అని అన్నారు. గోదావరిలో ఇసుకంతా దోచేస్తున్నారని, పోలవరం మట్టితో కోట్లు కొల్లగొడుతున్నారన్నారు. నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో అవినీతికి పాల్పడుతున్నారని, సస్పెండ్ అయిన ఐటిడిఎ పిఒ సూర్యనారాయణతో అవినీతి చేశారన్నారు. టి.నరసాపురం సొసైటీలో ఎంఎల్‌ఎ బినామీలు రూ.120 కోట్లు అవినీతి చేశారన్నారు. టిడిపి అధికారంలోకొచ్చాక ముక్కుపిండి వసూలు చేస్తామన్నారు. జగన్ టిడిపి కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని, ఎన్ని కేసులు ఎక్కువ ఉంటే అంత పెద్ద నామినేటెడ్ పదవి ఇస్తామన్నారు.

లోకేష్‌ది యువగళం కాదు.. గందరగోళం

పవన్ ప్రసంగాలను ఎన్నికల సంఘం పరిశీలించాలి - డిప్యూటీ సిఎం కొట్టు



మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

టిడిపి నేత లోకేష్‌ది యువగళం కాదని.. గందరగోళం అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. యువతను రెచ్చగొట్టి సమాజానికి కీడు చేసే విధంగా ఉంటున్న పవన్ కళ్యాణ్ ప్రసంగాలను ఎన్నికల సంఘం పరిశీలించాలని ఆయన కోరారు. తాడేపల్లిగూడెం మండలం మోదుగ్గుంట గ్రామంలో బుధవారం రాత్రి గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు మీడియాతో మాట్లాడుతూ పాదయాత్ర అంటే ఎంతో ఓర్పు, సహనం ఉండాలన్నారు. అది ఒక్క జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. లోకేష్ పాదయాత్రలో ఎవరైనా గత తెలుగుదేశం ప్రభుత్వం వైఫల్యాలపై నిలదీస్తుంటే వారిని తన బౌన్సర్లతో కొట్టిస్తున్నాడని ఆరోపించారు. పాదయాత్రలో ఎక్కడైనా ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్నారా అని ప్రశ్నించారు. కవాతులు చేయాలని, కత్తికి కత్తి, కర్రకు కర్ర, మిలిటెంట్లుగా తయారవ్వాలి అంటూ పవన్ కళ్యాణ్ యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాడని విమర్శించారు. రెచ్చగొట్టే విధంగా సాగుతున్న పవన్ ప్రసంగాలను ఎన్నికల కమిషన్ పరిశీలించాలన్నారు. డబ్బు సంపాదించడానికి మాత్రమే పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టాడని, అధికారంలోకి రావడానికి కాదని అన్నారు. కాపు సామాజిక తరగతికి పవన్ తీవ్ర అన్యాయం చేస్తున్నాడని విరుచుకుపడ్డారు. 60 సంవత్సరాలు నిండిన వృద్ధుల ఓట్లు తొలగించేందుకు జిత్తుల మారి నక్క చంద్రబాబు కుట్రలు పన్నుతున్నాడని ఆరోపించారు. గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన కుటుంబాలవారీ పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి ముప్పిడి సంపత్‌కుమార్, మోదుగ్గుంట సర్పంచి కట్టా సత్యవతి జానకి రామయ్య, సచివాలయ కన్వీనర్ కామన చంద్రరావు, ఎంపిటిసి దండుబోయిన విజయదుర్గ, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, సొసైటీల ఛైర్మన్లు, మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వచ్చే నెలాఖరు వరకూ ఓటర్ల సవరణ ప్రక్రియ : కలెక్టర్



ప్రజాశక్తి - భీమవరం

ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ స్వీకరణ సెప్టెంబర్ నెలాఖరు వరకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో డ్రాఫ్ట్ రోల్ పబ్లికేషన్ జరుగుతుందని, అప్పటి వరకు సవరణ జరుగుతుందని పేర్కొన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలోగా పోలింగ్ స్టేషన్ల ఫైనలైజేషన్ చేయాలని తెలిపారు. 1500 మందికన్నా ఎక్కువ ఓటర్లున్న పోలింగ్ స్టేషన్లలో కొత్త పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈలోపు తహశీల్దార్లు అన్ని పోలింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి చెక్‌లిస్ట్ ఇవ్వాలని తెలిపారు. సదరు మార్పులపై జిల్లాస్థాయిలో చర్చించి ఎన్నికల కమిషన్‌కు పంపించినట్లు పేర్కొన్నారు.


కుముదవల్లిలో నిలిచిన ట్రెయిన్

కుముదవల్లిలో నిలిచిన హటియ ఎక్స్‌ప్రెస్

ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలోని కుముదవల్లి రైల్వే ట్రాక్‌పై హటియ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. భీమవరం రైల్వే స్టేషన్ నుంచి ఈ ట్రెయిన్ రాకపోకలకు సంబంధించి సమయానికి సిగ్నల్స్ అందకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. సుమారు 20 నిమిషాల పాటు ట్రాక్‌పై ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జార్ఖండ్ నుంచి బయలుదేరిన శ్రీమ విశ్వేశ్వరయ్య టు బెంగళూరు వెళ్లే హటియ ఎక్స్‌ప్రెస్ కుముదవల్లి రైలు పట్టాలపై నిలిచిపోయింది. ఎట్టకేలకు ట్రెయిన్ వెళ్లేందుకు సిగ్నల్ రావడంతో యథావిధిగా కొనసాగింది. రైల్వే డబ్లింగ్ పనులు పూర్తయిన తర్వాత డబుల్ ట్రాక్ ఏర్పాటయ్యే తరుణా ట్రెయిన్ల రాకపోకలకు సంబంధించి సిగ్నల్ సమస్యలు ఏర్పడుతున్నట్లు తెలిపారు.



టిడిపితోనే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

టిడిపి అధికారంలోకి వస్తే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ అన్నారు. బుధవారం గురువులో గ్రామ అధ్యక్షుడు ఆనందరెడ్డి ఆధ్వర్యంలో మహిళా శక్తి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మినీ మేనిఫెస్టోలో అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు టి.శ్రీనివాసరెడ్డి (బుల్లాలు), కార్యదర్శి మురళీమోహన్‌రావు, సాంబ, కర్రి సుబ్బారెడ్డి, తాతారావు పాల్గొన్నారు.


బాధితులకు సాయం అందజేస్తున్న యునైటెడ్ కాపు క్లబ్ సభ్యులు

బాధితులకు కాపు క్లబ్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు యునైటెడ్ కాపు ఇంటర్ నేషనల్ క్లబ్ సమావేశం బుధవారం దీప్తి స్కూల్ ఆవరణలో జరిగింది. ఇటీవల యాక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడిన కొప్పినీడి బాలాజీకి వైద్యం నిమిత్తం రూ.5000, వరిధనం గ్రామానికి చెందిన మద్దాల పవన్‌రామ్‌కు రూ.10,000 ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, అధ్యక్షులు గాది ఆంజనేయులు, కార్యదర్శి పశ్యావుల రవికుమార్, కోశాధికారి ఇనుకొండ శేషాద్రి, రావూరి అప్పారావు పాల్గొన్నారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న పట్టణ, రూరల్ సిఐలు నాగరాజు, మూర్తి

గూడెంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక 15వ వార్డు సవితృపేటలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సిఐ నాగరాజు, రూరల్ సిఐ మూర్తి, కొట్టు విశాల్ ప్రారంభించారు. ఈ శిబిరంలో విజయవాడ కామినేని హాస్పటల్ వైద్యులు బిపి షుగర్, గుండె సంబంధిత వ్యాధులు , థైరాయిడ్, ఊపిరితిత్తుల సమస్యలు ,అన్ని రకాల నొప్పులు, అన్ని రకాల వ్యాధులు, మెదడుకు సంబంధించి వ్యాధులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. టూడి, ఇకో, ఇసిజి, షుగర్ టెస్టులు, బిపి పరీక్షలు ఆధునిక యంత్రాలతో జరిపి మందులు ఉచితంగా అందజేశారు. మెదడు నరాలకు సంబంధించిన న్యూరాలజిస్టు డాక్టర్ వి.కృష్ణవేణి, గుండె వైద్య నిపుణులు ఎన్‌కె కామాక్షి ఎమర్జెన్సీ ఫిజీషియన్ డికె.కిషోర్ వైద్య సేవలందజేశారు. ఈ శిబిరంలో దాదాపు 600 నుంచి వెయ్యి మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

హక్కులతో పాటు బాధ్యతలు గుర్తించాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ హక్కులు తెలుసుకోవడంతో పాటు బాధ్యతలను కూడా గుర్తించాలని ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ సూచించారు. పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని శృంగవృక్షంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ షేక్ హుస్సేన్ మాట్లాడుతూ పౌర హక్కుల దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. అనంతరం సర్పంచి సూరిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవడంతో తమ హక్కులు, బాధ్యతల గురించి తెలుసుకునే అవకాశం ఎక్కువ కలుగుతుందన్నారు. సమాజంలో అందరూ చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎపిఎం భారతి, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొన్నమండ బాలకృష్ణ

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

జెసికి విఆర్‌ఎల సంఘం నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు బి.గణేష్, గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు అన్నారు. ఈనెల 25న విఆర్‌ఎలు చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుమతిచ్చి విజయవాడ చేరుకునేసరికి అనుమతి లేదంటూ అరెస్టులు చేసి నిర్బంధించడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డికి సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం నేతలు గణేష్, ఆంజనేయులు మాట్లాడారు. ప్రభుత్వం విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన డిఎ కూడా ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. విఆర్‌ఎ పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టం చేసిందన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం నోటికొచ్చిన వాగ్దానాలు చేసి అధికారం చేపట్టాక నాలుక కర్చుకోవడం పాలకులకు అలవాటుగా మారిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి కూడా ఈ విధానాన్ని అవలంబించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం భీమవరం డివిజన్ ఉపాధ్యక్షులు సుబ్బారావు, శ్రీకాంత్, మాణిక్యాలరావు, జాన్ మోషే, నాగేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.


జెసికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఘనంగా రక్షాబంధన్


ఎంఎల్‌ఎకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమాజంలో అక్క, చెల్లెమ్మ అందరూ సంతోషంగా ఉండాలని, కుటుంబంలో మహిళలు సంతోషంగా ఉంటేనే ఆ కుటుంబం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ఎంఎల్‌ఎ గ్రంథి శ్రీనివాస్ అన్నారు. మహిళలందరికీ ఎంఎల్‌ఎ గ్రంథి శ్రీనివాస్ బుధవారం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో మహిళల పేరు మీద ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలూ అమలు చేస్తుందన్నారు. మహిళలకు రక్షణగా కట్టుదిట్టమైన చట్టాన్ని తమ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి అక్క, చెల్లెమ్మనూ ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారన్నారు.

పాలకొల్లు :బ్రహ్మ కుమారీలు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీకి బుధవారం రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హాస్పిటల్ బోర్డ్ మెంబర్ చెన్ను విజయ్, పెచ్చెట్టి కృష్ణాజీ, మాజీ కౌన్సిలర్ రేలంగి శ్రీను పాల్గొన్నారు. అలాగే వైసిపి కార్యాలయం వద్ద వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపికి, టిటిడి సభ్యులు మేకా శేషుబాబుకు బ్రహ్మ కుమారీలు, పలువురు మహిళలు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. గుణ్ణం నాగబాబు కార్యాలయం వద్ద పలువురు వైసిపి మహిళా నేతలు ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మండలంలో పలు సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు జనసేన మండల అధ్యక్షులు కోయ వెంకట్ కార్తీక్, జనసేన జిల్లా జాయింట్ సెక్రెటరీ షేక్ ముంతాజ్ బేగం ఆలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీన పర్యావరణ పరిరక్షణ పరంగా మార్టేరులోని వేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటడం, బసంతి దేవి గర్ల్స్ హైస్కూల్లో మొక్కలు నాటడం జరుగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీన చిరంజీవి యువత నియోజకవర్గ ఇన్‌ఛార్జి దార్లంక మారుతి ఆధ్వర్యంలో భవన కార్మికులకు భోజనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 2వ తేదీన పెనుమంట్రలో జన సైనికులతో మెగా బ్లడ్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

పాలకొల్లు: సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్లో ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించనున్నట్లు జనసేన పట్టణ అధ్యక్షులు శిడగం సురేంద్ర తెలిపారు. మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా గవర ఉదయ శ్రీనివాస్ (బన్నీ వాసు) పాల్గొంటారని చెప్పారు.

అమెరికాలో అన్నమయ్య విగ్రహం ఏర్పాటు అభినందనీయం

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

అన్నమాచార్యులు విగ్రహాన్ని అమెరికాలో నెలకొల్పేందుకు శ్రీకారం చుట్టడం ఆనందదాయకమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నత్తారామేశ్వరంలోని ఎకె ఆర్ట్స్‌లో రోబో టెక్నాలజీ ద్వారా 111 పంచలోహ అన్నమయ్య విగ్రహానికి మూడు రోజులు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలకు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్య చరిత్రలో వాగ్గేయకారుడుగా తాళ్లపాక అన్నమాచార్యులు తిరుమల తిరుపతి దేవస్థానం వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ మూడు వేలకు పైగా కీర్తనలు రచించి ఆలపించారన్నారు. అన్నమయ్య సంకీర్తనలు సాహిత్య సంగీత భావజాలాన్ని పెనవేసుకున్నాయన్నారు. అటువంటి మహోన్నతమైన అన్నమయ్య విగ్రహాన్ని అమెరికాలో ప్రవాసాంధ్రులు సప్తకోటి లింగార్చన పేరుతో నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎకెఆర్ అధినేత కరుణాకర్ వడయార్‌ను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ దుగ్గిరాల ప్రసాద్ విజయ దంపతులు, పెనుగొండ కరుణాకర్ వడియార్ లావణ్య దంపతులు, పెనుగొండ కేశవరావు మాస్టర్ దంపతులు హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు పిల్లి బాలాజీ, నీలిమ, రంజిని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఎంఎస్‌ఎంఇ కర్ణాటక ఛైర్మన్‌గా రాజా అమర్నాథ్

ప్రజాశక్తి - ఆకివీడు

ఎంఎస్‌ఎంఇ (సూక్ష్మ లఘు మధ్య తరహా పరిశ్రమల స్థాపన అభివృద్ధి సంస్థ) కర్నాటకా ఛైర్మన్‌గా సంస్థ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్, ప్రముఖ న్యాయవాది రాజా అమరనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం సాయంత్రం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించి అందుకు ముందుకొచ్చే వారికి ప్రోత్సాహాలు కల్పించడం తమ లక్ష్యమని చెప్పారు. అవసరమైన చోట ఆ మేరకు యువతను ప్రోత్సహించి వారిని చైతన్యపర్చడం తమ బాధ్యతన్నారు. ఆ మేరకు రాష్ట్రంలో త్వరలో కుటీర పరిశ్రమల స్థాపన, అభివృద్ధి కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సంస్థకు తాను ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్‌గా ఉన్నానని, అయితే తనను తెలంగాణ ఇన్‌ఛార్జిగా, కర్ణాటక రాష్ట్రం ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటికే తాను మరో సేవా సంస్థ 'సాయి ట్రస్ట్ ఒరిస్సా'కు జిల్లా కోఆర్డినేటర్‌గా ఉన్నానని, సెప్టెంబర్ నెలాకరు నుంచి ఈ సంస్థ కార్యక్రమాలు ఇక్కడ ప్రారంభిస్తామని తెలిపారు.


రాజా అమరనాథ్

సమస్యలు పరిష్కరించాలని విఎఒల వినతి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

వైఎస్‌ఆర్ క్రాంతి పథకంలో పనిచేస్తున్న యానిమేటర్లు (విఎఒ)లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన బుధవారం ఎపిఎం పద్మావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఎఒలు మాట్లాడుతూ కనీస వేతనం రూ.8,000 నుంచి రూ.25,000 పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, 3 సంవత్సరాల వయో పరిమితి జిఒను రద్దు చేయాలని, పెంచిన జీతాలను యానిమేటర్ల పర్సనల్ అకౌంట్‌లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలకు జన సమీకరణంకు తమను ఉపయోగించుకుంటున్నారని, తమను చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జి.పద్మకుమారి, కె.పార్వతి, పి.సావిత్రి, కె.సూర్యకుమారి, బి.అనంతలక్ష్మి, జ్యోతి రత్నం, ఎస్.రాఘవమ్మ, డి.నాగమణి పాల్గొన్నారు.


ఎపిఎంకు వినతిపత్రం అందజేస్తున్న విఎఒలు

పారిశుధ్య నిర్వహణ గాలికి..!

దోమలతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - కాళ్ల

వర్షాకాలం నేపథ్యంలో ప్రజారోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణ, శుద్ధ జలాన్ని అందించడంపై పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యశాఖలు కనీసం దృష్టి సారించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతిసారతో పాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలపై అవగాహన పెంచేలా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించడంలో వైద్య శాఖ నామమాత్రంగా వ్యవహరిస్తోంది.

మండలంలో 21 గ్రామాలు ఉన్నాయి. వాటిలో సగానికి పైగా పంచాయతీలు చిన్న చిన్న పనులు, పారిశుధ్య నిర్వహణకు ఆర్థిక సంఘం నిధులపైనే ఆధారపడుతున్నాయి. ఫలితంగా పారిశుధ్య నిర్వహణ లేక వీధులు చెత్తతో నిండిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రధాన రహదారుల్లో సిమెంట్, కాంక్రీట్ రోడ్లు, మురుగు కాలువలను మరిపిస్తున్నాయి. ఈ రోడ్లకు ఇరువైపులా నివాస గృహాల వారు మెరక చేయడంతో నీరు ఎటూ వెళ్లే మార్గం లేక రోజుల తరబడి నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. సిమెంట్ రోడ్లపై రోజుల తరబడి తిష్ట వేసిన మురుగునీరు మళ్లింపు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. శాఖల మధ్య సమన్వయ లోపంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన వీధులు మురుగు కూపాలు డంపింగ్ యార్డులుగా మారుతూ దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. పంచాయతీల ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం మళ్లించడంతో సర్పంచులు విధులు, నిధులు లేక ఉత్సవ విగ్రహాలుగా మారారు. దీంతో పారిశుధ్య నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

దోమల బెడద...

గ్రామాల్లో రోజు రోజుకూ దోమల బెడద పెరుగుతోంది. పంచాయతీ పాలక వర్గాలు, అధికార యంత్రాంగం అరకొర చర్యలు తీసుకోవడం, గ్రామాల్లో పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో చెత్త వేయడం, శివారు ప్రాంతాల్లో మురుగు కాలువలు సరిగ్గా ప్రవహించకపోవడంతో దోమలు మరింత విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలకు దోమల బెడద తప్పడం లేదు. చెత్తకు ఆవాసాలుగా ఉన్న ప్రాంతాలు, మురుగు పారని ప్రాంతాల్లో పారిశుధ్య మెరుగుదలకు అటు అధికారులు.. ఇటు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏంతైనా ఉంది.

ముందస్తు చర్యలపై దృష్టి సారించాలి..

వర్షాకాలం ప్రారంభం కావడంతో అన్ని శాఖలకు పని ఉంటుంది. ముఖ్యంగా తాగునీరు సరఫరా చేసే పైపులైను మురుగునీటిలో ఉన్న వాటిని గుర్తించి లీకేజీలను అరికట్టాలి. గృహాలకు రక్షిత తాగునీరు రంగు మారి సరఫరా జరుగుతోంది. దీనిపై సంబంధిత పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య సిబ్బంది, దృష్టి సారించి నీటి పరీక్షలు నిర్వహించి రక్షిత తాగునీరు అందించాల్సిన అవసరం ఉంది. పరిసరాల పరిశుభ్రత, కలుషిత ఆహారం తీసుకోకుండా జాగ్రత్తలు, దోమల నియంత్రణ, ప్రణాళిక రూపొందించడంలో అప్రమత్తంగా ఉండాలి.

పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తాం..

ఎంవి.భాస్కరరావు, ఇఒఆర్‌డి , కాళ్ల

గ్రామంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పారిశుధ్య పనులు, స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తాం. మండలంలో 21 గ్రామాలకు గాను ఏలూరుపాడు, కాళ్ల, కాళ్లకూరు, దొడ్డనపూడి, పెదఅమిరం, జక్కరం ఆరు గ్రామాలకు మాత్రమే ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. పాగింగ్ యంత్రాల ద్వారా దోమల నివారణ చర్యలు చేపట్టాలని, ఫిల్టర్ చేసిన తాగునీటిని కుళాయిల ద్వారా అందించాలని గ్రామ కార్యదర్శులకు సూచించాం.

చట్టసభల్లో బిసిలకు స్థానం కల్పించాలి

ప్రజాశక్తి - పెనుగొండ

ఉభయగోదావరి జిల్లాల్లో బిసిలు 55 శాతం ఉన్న ఉన్నారని, వారికి చట్టసభల్లో స్థానం కల్పించాలని మాజీ ఎంఎల్‌సి మల్లుల లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం పెనుగొండ బిసి కమిటీ హాల్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న సందర్భంగా బిసిలకు రాజ్యాంగ అధికారం దక్కట్లేదన్నారు. పార్టీలు బిసిలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్నారని విమర్శించారు. బిసిలకు రిజర్వేషన్ పద్ధతి అమలు చేయాలని, ప్రభుత్వాలు శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించినప్పటికీ ఏ ప్రభుత్వమూ అమలు చేయడం లేదని తెలిపారు. ఇప్పటికైనా బిసిలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు. పాలకొల్లు తణుకు నరసాపురం నియోజవర్గంలో వారికి స్థానం కల్పించాలని అన్నారు.

టిడిపికి ప్రజాబలం లేదు : ఎంఎల్‌ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరంరూరల్

టిడిపి ప్రజా బలం పూర్తిగా కోల్పోయిందని, దీంతో దొడ్డిదారిన అధికారంలోకి రావాలని చంద్రబాబు నానా తంటాలు పడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో పదివేల వైసిపి ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భీమవరం నియోజకవర్గంలో పదివేల మంది వైసిపి ఓట్లను తొలగించేందుకు ఇక్కడ టిడిపి నాయకులు కుట్ర చేశారని, బతికున్న వైసిపి సానుభూతిపరులు మృతి చెందినట్లుగా వారి ఓట్లను తొలగించాలని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. సమాచార హక్కు చట్ట ప్రకారం తాము ఓటర్ల జాబితాను తీసుకుని పరిశీలించామని తెలిపారు. తన తల్లి గ్రంధి వెంకటరత్నం, డాక్టర్ వేగిరాజు రామకృష్ణంరాజు, నాచు శేషగిరిరావు వంటి అనేకమంది బతికుండగానే మరణించారని టిడిపి పార్టీ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. వైసిపి దొంగ ఓట్లు నమోదు చేస్తుందని చెప్పడం చూస్తుంటే దొంగే దొంగ దొంగ అని అరచినట్లుగా ఉందన్నారు. ఎన్నికల్లో చంద్రబాబుకు సరైన గుణపాఠం ప్రజలే చెబుతారని ఎంఎల్‌ఎ తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి జిల్లా తెలుగు మహిళా కమిటీ కార్యదర్శి ఉప్పలపాటి లక్ష్మీ కుమార్తె వివాహం నిమిత్తం టిడిపి నాయకులు స్థానికజిల్లా టిడిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి చేతులు మీదుగా ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ టిడిపి కృష్ణ బలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు గంటా త్రిమూర్తులు 20 వేల రూపాయలు, గౌడ సాధికార కమిటీ జిల్లా జిల్లా కన్వీనర్ వీరమల్లు సూరిబాబు రూ.5 వేలు వివాహ నిమిత్తం అందజేసినందుకు ఆమె అభినందించారు.


సాయం అందజేస్తున్న సీతారామలక్ష్మి